క్లుప్తంగా

రంగవల్లుల పోటీలు



ముగ్గులు వేస్తున్న మహిళలు

శ్రీకాళహస్తి : పట్టణంలోని గాలిగోపురం వద్ద సిటిజన్స్ వెల్ఫేర్‌ఫోరం ఆధ్వర్యంలో సంక్రాంతి ముగ్గుల పోటీలను నిర్వహించారు. పెద్ద సంఖ్యలో మహిళలు ముగ్గుల పోటీల్లో పాల్గొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీడీపీఓ శాంతి దుర్గ హాజరయ్యారు. మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలన్నారు. సంస్థ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోలా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. సంస్కృతి సంప్రదాయాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. అనంతరం విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎన్‌స్టోర్ యజమాని మోహన్ నవీన్‌కుమార్, సుజాతమ్మ, కోలా సంగీతరావు, ఉదయ భాస్కర్ పాల్గొన్నారు.

సీసీ పనులు వేగవంతం

బుచ్చినాయుడుకండ్రిగ : మండలంలో ఉపాధి నిధులతో చేపడుతున్న సిమెంట్ రోడ్డు పనులను వేగవంతం చేయాలని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం తెలిపారు. శనివారం కారణిలో సిమెంట్ రోడ్డు పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఉపాధి హామీ పథకంలో రూ. 2 కోట్ల నిధులతో సీసీ రోడ్లు మంజూరయ్యాయని తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఐ విశ్వనాథనాయుడు, సర్పంచ్ పద్మమ్మ, కార్తీక్ పాల్గొన్నారు.

గోకులం షెడ్లపై సమీక్ష

బుచ్చినాయుడుకండ్రిగ : మండలంలో ఉపాధి హామీ నిధులతో చేపట్టనున్న గోకులం షెడ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీడీఓ త్రివిక్రమ్‌రావు తెలిపారు. శనివారం గోకులషెడ్ల నిర్మాణాలపై ఏపీఓ భానుప్రియ, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. మండలానికి 16 గోకులషెడ్లు మంజూరయ్యాయని తెలిపారు. ఈ షెడ్లను 10 శాతం లబ్ధిదారుని వాటాతో 90 శాతం ప్రభుత్వ రాయితీతో నిర్మించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో వెలుగు ఏపీఎం మునెయ్య, పాల్గొన్నారు.

అన్నదానం

నాగలాపురం : మండల కేంద్రంలోని టీటీడీ అనుబంధంగా ఉన్న శ్రీ వేదనారాయణ స్వామి ఆలయంలో శనివారం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేసినట్లు ఆలయ అధికారి చెంగల్‌రాయులు తెలిపారు. ఆలయంలో ప్రతి శనివారం దాతల సహకారంతో అన్నదానం చేపడుతున్నట్లు పేర్కొన్నారు. అన్నదానానికి విద్యుత్ లైన్‌మెన్ జైకుమార్ ఉభయదారులుగా వ్యవహరించారన్నారు.

నైపుణ్యంతోనే అవకాశాలు



బ్యూటీషియన్ కిట్ అందజేస్తున్న ఎస్పీ

రేణిగుంట : ఉపాధిలో అవకాశాలను అందిపుచ్చుకోవాలంటే నైపుణ్యాలు తప్పనిసరి అని ఎస్పీ సుబ్బరాయుడు పేర్కొన్నారు. శ్రీకాళహస్తి మండలం రాచగున్నేరి సమీపంలోని ఎలక్ట్రో స్టీల్ కాస్టింగ్స్ లిమిటెడ్ (ఈసీఎల్) కర్మాగారంలో జరిగిన బ్యూటీషియన్ కోర్సు శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఏ రంగంలో రాణించాలన్నా నైపుణ్యాలు తప్పనిసరిగా ఉండాలన్నారు. కర్మాగారం ఈడీ సురేష్ ఖండేల్వాల్ మాట్లాడుతూ.. ఈ ప్రాంతవాసులకు జీవనోపాధిని పెంపొందించటానికి తమ వంతు సామాజిక కార్యక్రమాలను చేపడుతున్నామన్నారు. అందులో భాగంగానే మహిళలకు బ్యూటీషియన్ కోర్సుపై శిక్షణ తరగతులను నిర్వహించినట్లు తెలిపారు. సీనియర్ జీఎం దొరైరాజ్, సిబ్బంది పాల్గొన్నారు.

అభ్యుదయ రైతు పురస్కారం

రేణిగుంట : గుంటూరు విజ్ఞాన్ విశ్వవిద్యాలయం, రైతు నేస్తం ఫౌండేషన్ సంయుక్తంగా శనివారం గుంటూరులో నిర్వహించిన సంక్రాంతి సంబరాల్లో మండలంలోని కరకంబాడి రాస్ కృషి విజ్ఞాన కేంద్రం దత్తత రైతు పురుషోత్తంనాయుడిని అభ్యుదయ రైతు పురస్కారంతో సత్కరించారు. మంత్రి అచ్చెన్నాయుడు, ఎంపీ కృష్ణదేవరాయలు చేతుల మీదుగా అవార్డును అందజేశారు. ఆధునిక సాంకేతికత, వ్యవసాయంలో విభిన్న విధానాలను పాటించటంతోనే అభ్యుదయ రైతుగా ఎంపిక చేశారన్నారు. అవార్డు ఎంపికపై రాస్ ప్రతినిధి వెంకటరత్నం, శాస్త్రవేత్త శ్రీనివాసులు ఆనందం వ్యక్తం చేశారు.

2న బ్రాహ్మణ వివాహ పరిచయ వేదిక



గోడపత్రికలను ఆవిష్కరిస్తున్న బ్రాహ్మణులు

శ్రీకాళహస్తి : అఖిల భారత బ్రాహ్మణ కల్యాణోపద్యా వివాహ సమాచార కేంద్రాల సంఘం, తిరుపతి అర్బన్ బ్రాహ్మణ సేవా సంఘం సంయుక్త ఆధ్వర్యంలో ఫిబ్రవరి2న బ్రాహ్మణ వధూవరుల వివాహ పరిచయ వేదిక నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ అధ్యక్షుడు శేషగిరిరావు తెలిపారు. శనివారం కరపత్రాలు, గోడపత్రికలను ఆవిష్కరించారు. సామూహిక షష్టి పూర్తి, భీమరథ శాంతి, శబూంతి హోమం, వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. తిరుపతిలోని ఇస్కాన్ రోడ్డు వినాయక నగర్‌లోని శ్రీకంచి పాదుక మండపంలో జరుగుతాయన్నారు. ఈనెల 16లోపు బ్రాహ్మణ వధూవరులు తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో విశ్వనాథ్, సుబ్బారావు పాల్గొన్నారు.



సంతలో మురుగు మధ్యనే కూరగాయల విక్రయాలు



మరమ్మతులకు నోచుకోని బాత్‌రూంలు

ఇదేం సంత !

రేణిగుంట వారపు సంతకు వందేళ్ల చరిత్ర ఉంది. ఈ సంతకు రేణిగుంట మండలంలోని ప్రజలే కాక చుట్టు పక్కల గ్రామాల నుంచి వేల మంది కొనుగోలు, అమ్మకాలు చేయడానికి వస్తుంటారు. పంచాయతీకి సంత నుంచి నెలకు సుమారు లక్ష రూపాయల వరకు ఆదాయం వస్తున్నా కనీస వసతులు కల్పించడంలో అధికారులు విఫలమవుతున్నారు.

– శ్రీకాళహస్తి రూరల్ (రేణిగుంట)

- అసౌకర్యాల మధ్య వారపు సంత
- అలంకారప్రాయంగా మరుగుదొడ్లు
- మౌలిక సదుపాయాలు శూన్యం
- పట్టించుకోని అధికారులు



సంతలో పట్టలు కట్టుకొని ఇలా..

మండల కేంద్రమైన రేణిగుంట పట్టణంలో దశాబ్దాలుగా ప్రతి శనివారం నిర్వహించే వార సంత ఎంతో ప్రాముఖ్యం సంతరించుకుంది. ప్రధానంగా ఎండు చాపల విక్రయానికి పెట్టింది పేరు. చుట్టు పక్కల జిల్లాల నుంచే కాకుండా తమిళనాడు, కేరళ రాష్ట్రాల నుంచి చెరువు మెత్తాల్లు, సముద్రపు సొర చాపల వరకు అన్ని రకాల ఎండు చాపలు ఇక్కడ విక్రయిస్తారు. అందుకే ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఎండు చాపలకు రేణిగుంట **వారపు** సంత ప్రసిద్ధి.

రైతులే నేరుగా విక్రయాలు

సంతకు చుట్టు పక్కల గ్రామాల నుంచి రైతులు స్వయంగా పండించిన కూరగాయలు, ఆకు కూరలు, తాజా పండ్లు విక్రయాలు చేస్తుంటారు. వారపు సంత వలన పంచాయతీకి లక్షల్లో ఆదాయం వస్తున్నా అభివృద్ధిలో మాత్రం శూన్యమనే చెప్పాలి.

ప్రాంగణం అంతా గుంతలే

వారపు సంత ప్రాంగణం మొత్తం గుంతలే దర్శనమిస్తున్నాయి. కాల్వలు, అంతర్గత రహదారులు లేకపోవడంతో చినుకు పడితే చిత్తడి చిత్తడిగా మారి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షం వచ్చిందంటే ప్రాంగణం మొత్తం బురదమయంగా మారి కాలు పెట్టేందుకు వీలుకాని పరిస్థితులు నెలకొన్నాయి. ఆ మురుగు గుంతల పక్కనే మనం తినే కూరగాయలను పెట్టుకొని విక్రయాలు చేస్తుండడం ఆందోళన కలిగిస్తోంది.

సంత ప్రాంగణంలో షెడ్‌లు ఏర్పాటు చేయకపోవడంతో వాన, ఎండకు అడ్డుగా పట్టలు కట్టుకొని వ్యాపారాలు చేస్తున్నారు.

మరుగుదొడ్లు లేక అవస్థలు

వారపు సంతలో ప్రతి శనివారం సుమారు 200 మంది వ్యాపారులు వివిధ దూర ప్రాంతాల నుంచి వారపు సంతకు చేరుకుంటారు. ఎండు చేపల వ్యాపారులు మూడు రోజుల ముందుగానే సంతకు చేరుకొని చేపలను ఎండబెట్టి అక్కడే శనివారం వ్యాపారం చేసుకుంటారు. అలాగే కూరగాయలు అమ్మే వారు శుక్రవారం రాత్రి సంత వద్దకు చేరుకొని శనివారం రాత్రి వరకు అక్కడే వ్యాపారాలు చేసుకుంటారు. అందులో సగం మంది పైగా మహిళలు ఉంటారు. వారపు సంతలో మరుగుదొడ్లు లేకపోవడంతో మహిళలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

దొంగల బెడద అధికం

వారపు సంతలో రద్దీగా ఉండే సమయంలో దొంగలు చేతివాటం ప్రదర్శిస్తుంటారు. సంతకు వచ్చే జనాల జేబులో మొబైల్ ఫోన్లు పెట్టుకుంటే ఇక అంతే సంగతి. ప్రతి వారం సుమారు పది నుంచి 20 ఫోన్లు వారపు సంతలో చోరీకి గురవుతున్నాయి. కొందరు పోలీసులకు ఫిర్యాదు చేస్తుండగా మరి కొందరు ఫిర్యాదు చేయకుండానే బోరుమంటూ ఇంటికి చేరుతున్నారు. గాజులమండ్యం పోలీసులు దొంగతనాలు అరికట్టడంలో విఫలమవుతున్నారనే విమర్శలు ఉన్నాయి. వారపు సంతలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తే దొంగతనాలు తగ్గే అవకాశం ఉంది.

సంతకు రావాలంటే చిరాకు



రేణిగుంట సంతలో తాజా కూరగాయలు దొరుకుతాయి. ప్రతి శనివారం ఇక్కడికి వచ్చి కొంటాం. కానీ సంతలో సరైన సదుపాయాలు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. వర్షం వస్తే కనీసం కాలు పెట్టడానికి భయం వేస్తుంది. ఆ సమయంలో సంతకి రావాలంటేనే చిరాకు పుడుతుంది. – లక్ష్మి , అన్నాస్వామిపల్లి

మరుగుదొడ్లు బాగు చేయాలి



సుమారు వంద మంది మహిళలు వివిధ ప్రాంతాల నుంచి వ్యాపారాలు చేసుకునేందుకు సంతకు ప్రతివారం వస్తుంటాం. సంతలో మరుగుదొడ్లు ఉన్నా నీళ్లు లేక పాడైపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. బయటకు ఎటు పోవాలన్నా వీలుకాని పరిస్థితి. – పద్మమ్మ, నెల్లూరు , ఎండుచేపల వ్యాపారి

వసతులు కల్పించాలి



పంచాయతీకి ఆదాయం వస్తున్నా సంతని నిర్లక్ష్యం చేస్తున్నారు. సంతలో వచ్చే ఆదాయంతో కనీసం సగమైన వసతుల కోసం ఖర్చు చేయాలి. దొంగతనాలను అరికట్టేందుకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తే బాగుంటుంది. – నరసింహారెడ్డి , రేణిగుంట

సీసీ కెమెరాల ఏర్పాటుకు సూచనలు

సంతలో సీసీ కెమెరాలు, ప్రత్యేక పార్కింగ్ స్థలాన్ని ఏర్పాటు చేయాలని పంచాయతీ ఈఓకు సూచించాం. రద్దీగా ఉన్న సమయంలో దొంగతనాలు జరుగుతున్నాయి. పోలీసులు సాయంత్రం సమయంలో సంతలో ఉంటున్నారు. దొంగతనాలు జరగకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటాం. – సుధాకర్, ఎస్‌ఐ, గాజులమండ్యం

కిశోర వికాసం



మాట్లాడుతున్న ఎంపీడీఓ చంద్రశేఖర్

సత్యవేదు : బాలికల బంగారు భవిష్యత్తుకు కిశోర వికాసం పునాది వేస్తుందని ఎంపీడీఓ చంద్రశేఖర్ అన్నారు. శనివారం ఎంపీడీఓ కార్యాలయంలో కిశోర వికాసంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ దేవకుమారి మాట్లాడుతూ.. ప్రతి బాలిక సమగ్రాభివృద్ధికి ఈ కార్యక్రమం తోడ్పడుతుందని వివరించారు. 11–18 ఏళ్ల బాలికలకు విద్య, ఆరోగ్యం, భద్రత, ఆర్థిక స్వావలంబనే ఈ కార్యక్రమ లక్ష్యం అన్నారు. బాలికల్లో ఆత్మరక్షణ శిబిరాలు ఏర్పాటు చేయడం, డిజిటల్ భద్రత, సైబర్ క్రైమ్, ఆన్‌లైన్ వేదికలపై జాగ్రత్త ఉండేలా అవగాహన కార్యక్రమాలు చేపడతామన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ రవి, దాసుకుప్పం పీహెచ్‌సీ డాక్టర్ గుణశేఖర్, ఎంపీహెచ్‌ఈఓ సుబ్రహ్మణ్యం, ఈఓపీఆర్డీ తరుణాక్షరెడ్డి, ట్రస్టు కోఆర్డినేటర్ సుబ్రమణ్యం, అంగన్‌వాడీ సూపర్ వైజర్లు, 150 మంది అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్ఎంలు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

దోమల నిర్మూలనకు చర్యలు

బుచ్చినాయుడుకండ్రిగ : మండల కేంద్రంలో శనివారం సర్పంచ్ వెంకటమ్మ, ఉపసర్పంచ్ మునిరాజా దోమల నిర్మూలనకు మలాథీన్ మందును డ్రైనేజీ కాలువలు, మురుగు గుంతల్లో పిచికారీ చేయించారు.

క్వారీ కాలుష్యం నుంచి కాపాడండి



అధికారులకు విన్నవిస్తున్న గ్రామస్తులు

కేవీబీపురం (వరదయ్యపాళెం): క్వారీ కాలుష్యం నుంచి ప్రజలను కాపాడాలని కేవీబీపురం మండలం బ్రాహ్మణపల్లిలో జరిగిన రెవెన్యూ సదస్సులో స్థానికులు విన్నవించారు. శనివారం బ్రాహ్మణపల్లిలో రెవెన్యూ సదస్సు జరిగింది. గ్రామ సమీపంలోని పెరిందేశం రెవెన్యూలో ఓ ప్రైవేటు క్వారీ నుంచి వస్తున్న కాలుష్యంతో అటు పంటలు ఇటు ప్రజల ఆరోగ్యం పాడవుతోందని స్థానికులు అధికారులకు మొరపెట్టుకున్నారు. సీపీఎం మండల అధ్యక్షుడు నాగరాజు గ్రామస్తులకు మద్దతుగా నిలిచారు.

అంధులకు ఆత్మవిశ్వాసం

సత్యవేదు : అంధ విద్యార్థులకు మనోధైర్యం కలిగించాలని ఎంఈఓ రవి కోరారు. శనివారం నరసరాజు అగ్రహారం పంచాయతీలోని ప్రాథమిక పాఠశాలలో బ్రెయిలీ దినోత్సవం సందర్భంగా చిత్ర పటానికి నివాళులర్పించారు. అంధులు ఆత్మ విశ్వాసంతో సాగించే జీవనం స్ఫూర్తిదాయకమన్నారు. దివ్యాంగ విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈఓ-2 ఉష, ప్రధానోపాధ్యాయులు కనకరాజ్, ఐఈఆర్టీలు వెంకటరత్నం, కుమారి, రజనీ, పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి : తొట్టంబేడు భవిత కేంద్రంలో శనివారం లూయిస్ బ్రెయిలీ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఎంఈఓలు భారతి, భాస్కర్ ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. దివ్యాంగుల పట్ల దలే వారి అభివృద్ధికి దోహదం చేస్తాయన్నారు. అనంతరం వేదసాయి అనే విద్యార్థికి విద్యా సామగ్రిని అందజేశారు. కార్యక్రమంలో సహిత ఉపాధ్యాయులు నాగరాజు, చైతన్య పాల్గొన్నారు.

నాగలాపురం : స్థానిక భవిత కేంద్రంలో బ్రెయిలీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంఈఓలు బాబయ్య, జనార్దనరాజు హాజరయ్యారు. అనంతరం విద్యార్థులకు బహుమతి ప్రదానం చేశారు. కార్యక్రమంలో శివకుమార్, పుష్ప, జైపాల్, వసత పాల్గొన్నారు.



తొట్టంబేడులో విద్యాసామగ్రి అందజేస్తున్న ఉపాధ్యాయులు

బుచ్చినాయుడుకండ్రిగ : మండల కేంద్రంలోని భవిత కేంద్రంలో బ్రెయిలీ దినోత్సవాన్ని ఎంఈఓలు రవీంద్రనాథ్, మునిసుబ్రహ్మణ్యం ఘనంగా నిర్వహించారు. బ్రెయిలీ చిత్రపటానికి నివాళి అర్పించారు. అనంతరం అంధ విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులను ప్రదానం చేశారు. సహిత విద్య ఉపాధ్యాయులు అయ్యప్పరెడ్డి, నయోమి పాల్గొన్నారు.



నాగలాపురం: బహుమతి ప్రదానం చేస్తున్న ఎంఈఓలు బాబయ్య, జనార్దనరాజు



బ్రెయిలీ దినోత్సవంలో ఎంఈఓలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు

విద్యార్థులకు సైకిళ్లు



ఏర్పేడు మండలం పాపానాయుడుపేట హైస్కూల్ విద్యార్థులకు శనివారం స్ఫూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచితంగా సైకిళ్లను పంపిణీ చేశారు. 15 మంది పేద విద్యార్థులను గుర్తించి వారికి డిప్యూటీ డీఈఓ బాలాజీ చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో ఇంచార్జి ప్రధానోపాధ్యాయుడు జ్ఞాన రాధిక, స్ఫూర్తి ఫౌండేషన్ డైరెక్టర్ మరుపూరి శేఖర్, తేజోవతి, చంద్రశేఖర్ పాల్గొన్నారు. -రేణిగుంట

హామీలు నెరవేర్చాలి

శ్రీకాళహస్తి : ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మురళి అన్నారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శనివారం పట్టణంలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు పట్టణంలో 2 సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్ల ఇంటి స్థలాలు ఇవ్వాలన్నారు. 6వ తేదీ స్థానిక ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు జనమాల గురవయ్య, శ్రీరాములు, శివకుమార్, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

తాగి నడిపితే జైలే



కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ జయచంద్ర

రేణిగుంట : మద్యం తాగి వాహనాలు నడిపితే జైలుశిక్ష తప్పదని ఏర్పేడు సీఐ జయచంద్ర హెచ్చరించారు. డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన ఏడుగురితో పాటు వారి తల్లిదండ్రులకు శనివారం పోలీస్‌స్టేషన్‌లో కౌన్సెలింగ్ ఇచ్చారు. మైనర్లు వాహనాలు నడిపితే మొదటిసారిగా కేసులు, మరోసారి పట్టుబడితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

ఆదర్శంగా ఆమందూరు బృందావనం

రేణిగుంట: ఏర్పేడు మండలం ఆమందూరు బృందావనం(ఎస్‌డబ్ల్యూపీసీ)ని జిల్లాలోనే ఆదర్శ సంపద కేంద్రంగా తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. ఆమందూరులోని చెత్త నుండి సంపద తయారీ కేంద్రాన్ని శనివారం ఆయన ఐఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ కే.ఎన్ సత్యనారాయణతో కలిసి పరిశీలించారు. ఈ కేంద్రాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దడానికి చేపట్టాల్సిన అంశంపై సంబంధిత అధికారులతో కలిసి చర్చించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జి.సౌభాగ్య ఉన్నారు.



బృందావనాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్, ఐఐటీ డైరెక్టర్ సత్యనారాయణ

కళాశాలల్లో మధ్యాహ్న భోజనం

సత్యవేదు : ప్రభుత్వ జూనియర్ కళాశాల్లో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేస్తోందని ఎంఈఓలు ఉష, రవి పేర్కొన్నారు. శనివారం జూనియర్ కళాశాల విద్యార్థులు 161 మంది విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పెట్టారు. జక్కుల శివానందం, షన్ముగం, అధ్యాపకులు ప్రిన్సిపల్ వాణి, డీవీ రాజు, రాజేష్ పాల్గొన్నారు.

వరదయ్యపాళెం : ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనాన్ని స్థానిక ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని వడ్డించారు. ముందుగా గత ప్రభుత్వంలో నాడు–నేడు పథకం ద్వారా కళాశాలలో చేపట్టిన అభివృద్ధి పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు.



మధ్యాహ్న భోజనంలో కళాశాల విద్యార్థులు

నాగలాపురం : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం కళాశాల ప్రిన్సిపల్ శ్రీలత ఆధ్వర్యంలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ చిన్నదొరైసుధా, నాయకులు శ్రీనివాస యాదవ్, మురళీ, అన్బు, ఎంఈఓ బాబయ్య, జనార్దనరాజు, అధ్యాపకులు పాల్గొన్నారు.

బాలికలను చదవనిద్దాం



మాట్లాడుతున్న సీడీపీఓ కృష్ణమంజరి

రేణిగుంట : బాలికలను చదవనిద్దాం–రక్షిద్దామని సీడీపీఓ కృష్ణమంజరి పేర్కొన్నారు. స్త్రీ శిశుసంక్షేమశాఖ, రాస్ చైల్డ్ ఫండ్ సంయుక్తంగా శనివారం రేణిగుంట ఎంపీడీఓ కార్యాలయంలో కిశోర వికాస కార్యక్రమం నిర్వహించారు. బాలికల్లో వచ్చే శారీరక, మానసిక మార్పులు, పరిశుభ్రత, పోషకాహారం గురించి అవగాహన కల్పించారు. బాల్యవివాహాలను రూపుమాపేందుకు సమిష్టిగా కృషి చేయాలన్నారు. మేనేజర్ అశోక్ పండా, ఎంపీడీఓ విష్ణుచిరంజీవి, ఏఓ పిచ్చిరెడ్డి, ఎంఈవో– రంగనాథ్, ఎస్‌ఐ అరుణ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

ట్రాఫిక్ క్రమబద్ధీకరణ



ఈఓకు సూచనలు చేస్తున్న సీఐ

శ్రీ కాళహస్తి రూరల్ (రేణిగుంట): రేణిగుంటలోని రైల్వే ట్రాక్–బస్టాండ్‌కు వెళ్లే దారిలో ఎస్సై అరుణ్‌కుమార్ రెడ్డి ట్రాఫిక్ క్రమబద్ధీకరణ చేపట్టారు. రైల్వే ట్రాక్‌కు అటు వైపు సంత ముందు రోడ్డులో వేసిన దుకాణాలను గాజులమండ్యం సీఐ మురళీ కృష్ణ, ఎస్‌ఐ సుధాకర్, ఈఓ మణి ఆధ్వర్యంలో ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకున్నారు. వారితో పాటు శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ శంకర్ రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

గూడలవారిపాళెంలో చోరీ

వరదయ్యపాళెం : పట్టపగలు తాళం వేసి ఉన్న ఇంటిలోకి చొరబడి నగదు, బంగారం దోచుకెళ్లిన ఘటన వరదయ్యపాళెం మండలంలోని గూడలవారిపాళెంలో చోటు చేసుకుంది. బాధితులు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వివరాలు ఇలా.. గూడలవారిపాళెంలో సుబ్బమ్మ, తనయుడు శరత్ నివాసమున్నారు. సుబ్బమ్మ సమీపంలోని ఓ ప్రైవేటు పరిశ్రమలో పనిచేస్తోంది. ఆమె తనయుడు శరత్ తడ మండలంలో బార్బర్ షాపు ద్వారా ఉపాధి పొందుతున్నాడు. శుక్రవారం తల్లి, తనయుడు వారి పనులకు వెళ్లి రాత్రి ఇంటికి చేరగా ఇంటి తలుపులు తెరిచి ఉండడం గమనించారు. బీరువాలో ఉన్న రూ.4.50 లక్షల నగదు, అయిదు సవర్ల బంగారం, వెండి మొలతాడులను చోరీ చేసినట్లు తెలిపారు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ మల్లికార్జున, సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని క్లూస్ టీమ్ బృందంతో వేలిముద్రలను సేకరించారు.



బీరువాలోని వస్తువులు చిందర వందర పడేసిన దృశ్యం

65 మందికి పట్టాలు

వరదయ్యపాళెం : ఇంటి స్థలాలకు సంబంధించిన పొజిషన్ సర్టిఫికెట్లను అర్హత కలిగిన 65 మందికి ఎమ్మెల్యే ఆదిమూలం తహసీల్దార్ కార్యాలయంలో అందజేశారు. పేదల ఇంటి స్థలాల పొజిషన్ సర్టిఫికెట్లపై ఎక్కడా నిర్లక్ష్యం చూపొద్దని ఎమ్మెల్యే హెచ్చరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాజశేఖర్, ఎంపీడీఓ ప్రసాద్, డిప్యూటీ తహసీల్దార్ వెంకటసుబ్బయ్య, ఆర్‌ఐ శివకుమార్, ఎంఈఓలు సరస్వతి, గున్నయ్య, ఏఈ నాగభూషణం, జెడ్పీటీసీ వెంకటేశ్వర్లు, సర్పంచ్ వీరభద్రం, టీడీపీ మండల అధ్యక్షుడు యుగంధర్ రెడ్డి, మాజీ అధ్యక్షుడు జయచంద్ర నాయుడు, సురేష్ రెడ్డి, మునిభూషణమ్మ, సిద్ధలయ్య పాల్గొన్నారు.